ఫార్ములా-1ఈ ఒప్పందంలో తప్పేమిటి?

- బీజేపీ అధికార ప్రతినిధి రచనారెడ్డి

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తేతెలంగాణ): గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఫార్ములా 1ఈ రేస్ ఒప్పందంలో తప్పేమీ కనబడటం లేదని బీజేపీ అధికార ప్రతినిధి రచనారెడ్డి తేల్చిచెప్పారు. ప్రభుత్వం ఒక విదేశీ సంస్థతో నాలుగేండ్లకు ఒప్పందం చేసుకొని చట్టబద్ధంగా నగదు బదిలీ చేసిందని శనివారం ఆమె ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ చెప్పారు. పైగా సదరు సంస్థ ఇప్పటికీ ఒప్పందం ప్రకారం 2024, 2025లో కూడా ఈవెంట్స్ జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని ముందుకొస్తున్నదని తెలిపారు. ఈ ఒప్పందంలో ఏమైనా పొరపాటు జరిగితే సివిల్ వివాదం కిందికి వస్తుందే తప్ప క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు అవకాశం లేదని ఆమె స్పష్టం చేశారు.

2025లో 27 సాధారణ, 23 ఐచ్ఛిక సెలవులు

సెలవుల జాబితా విడుదల చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): వచ్చే సంవత్సరానికి సంబంధించిన సాధారణ, ఐచ్ఛిక సెలవుల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. 2025లో మొత్తం 27 సాధారణ, 23 ఐచ్ఛిక సెలవులు ఉన్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. జనవరి 14న సంక్రాంతి, మార్చి 30న ఉగాది, ఆగస్టు 27న వినాయకచవితి, అక్టోబర్ 3న దసరా, 20న దీపావళి పండుగలు ఉండనున్నాయి.

శబరిమల ప్రయాణికులకు బస్సు చార్జీల తగ్గింపు

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): శబరియాత్రకు బుక్ చేసుకున్న బస్సుల్లో గురుస్వామి, పదేండ్లలోపు వయసు కలిగిన ఇద్దరు మణికంఠ స్వాములు, ఇద్దరు వంట వాళ్లు, ఒక సహాయకుడికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నామని శనివారం ఆర్టీసీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బస్సుల అద్దెను 15 నుంచి 20 శాతం వరకు తగ్గించామని వెల్లడించారు. సూపర్‌లగ్జరీ కి. మీకు రూ. 65 నుంచి రూ. 59, రాజధానికి రూ. 84 నుంచి రూ. 77కు తగ్గించామని పేర్కొన్నారు.

వైఆర్ టీవీ రిపోర్టర్ రంజిత్‌రెడ్డి అక్రమ అరెస్ట్

- అనంతరం బెయిల్‌పై విడుదల

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): వైఆర్ టీవీ జర్నలిస్ట్ రంజిత్‌రెడ్డిని సైబర్‌క్రైం పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. శనివారం ఉదయం ఆయన తార్నాకలోని తన కార్యాలయంలో లిఫ్ట్ ఎక్కుతుండగా.. అప్పటికే అక్కడ మఫ్టీలో కాపుకాసిన పోలీసులు కిడ్నాప్ తరహాలో తీసుకెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా వైఆర్ టీవీలో రంజిత్‌రెడ్డి వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపిస్తూ మాజీ కార్పొరేటర్ షేక్ షరీఫ్ శుక్రవారం చేసిన ఫిర్యాదు చేశారని, దీంతో ఐటీ చట్టంలోని 67, 351(2), 352, 353(2) సెక్షన్ల కిం ద రంజిత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని పోలీసులు తెలిపా రు. అనంతరం న్యాయమూర్తి నివాసంలో రంజిత్‌రెడ్డి లీగల్ టీమ్ వాదనలు వినిపించడంతో బెయిల్ మంజూరు చేశారు. రెండ్రోజుల్లోగా ఆయనను నాంపల్లి కోర్టులో హాజరుపర్చాలని ఆదేశించారు. దీంతో రాత్రి రంజిత్‌రెడ్డిని పోలీసులు విడుదల చేశారు. ఆయన తరపు న్యాయవాది లక్ష్మణ్ మాట్లాడుతూ.. నమోదు చేసిన సెక్షన్లు 7 ఏండ్లలోపు శిక్షపడే అవకాశమున్నవేనని తెలిపారు.

రేవంత్‌కు వణుకెందుకు: కేటీఆర్

రంజిత్‌రెడ్డి అక్రమ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. 'ప్రశ్నించే వారంటే సీఎం రేవంత్‌రెడ్డికి ఎందుకంత వణుకు?' అంటూ 'ఎక్స్' వేదికగా నిలదీశారు. 11 నెలల కాంగ్రెస్ పాలనలో జర్నలిస్టులపై దాడులు, అకృత్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. సర్కారు నిర్బంధ విధానాలను జర్నలిస్టులంతా ఖండించాలని పేర్కొన్నారు.

అరెస్టు అప్రజాస్వామికం: హరీశ్

జర్నలిస్ట్ రంజిత్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 'ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, ప్రజల తరుపున నిలదీస్తే సంకెళ్లు వేస్తారా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న తప్పులను ఎత్తి చూపితే అక్రమ కేసులు పెట్టి ఇబ్బందిపెడతారా?' అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నాస్త్రాలు సంధించారు.

ఇంటింటా నిరసన

మొదటిపేజీ తరువాయి...

ప్రజలు ఇంటింటా నిలదీస్తున్నారు. ఎన్యూమరేటర్లు సమాచార సేకరణకు ప్రశ్నలేయడం అటుంచితే, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలపై ఎక్కడికక్కడ ఎదురుప్రశ్నలు ఎదురై ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎక్కడికి వెళ్లినా? ఎవరిని పలకరించినా? సర్వే ఎందుకు? కొత్తగా ఏమొస్తది? ఏం చేశారు? ఏం చేస్తరు?' అంటూ అడుగడుగునా ప్రశ్నిస్తున్నారని స్వయంగా ఎన్యూమరేటర్లు చెప్తున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు కొలువుదీరి ఏడాది కావస్తున్నా ఏ ఒక్క పథకం, హామీని అమలు చేయలేదని, మాటలు చెప్పి మోసం చేశాడని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని క్షేత్రస్థాయి అధికారులు తెలుపుతున్నారు. అంతేకాదు ఇప్పటికే రైతుబంధు ఇవ్వలేదని, రైతు రుణమాఫీ అందరికీ కాలేదని రైతాంగం, రూ.2,500 ఎక్కడని మహిళలు, పింఛన్లు పెంచలేదని ఆసరా లబ్ధిదారులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు తమకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ప్రశ్నిస్తున్నారని చెప్తున్నారు. తమకు ఏ పథకం ఇవ్వని ప్రభుత్వానికి వివరాలెందుకు ఇవ్వాలని తిప్పి పంపుతున్నారని అధికారులు స్వయంగా చెప్తున్నారు. కుటుంబ ఆదాయం, అప్పులు, ఆస్తిపాస్తుల అంశాలపై నోరుమెదపడమే లేదని, ఆ వివరాలను ఎందుకు అడుగుతున్నారని, వచ్చే పథకాలను కూడా రాకుండా చేస్తారా? అంటూ ప్రజలు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. కుటుంబ వివరాలు తప్ప మరే వివరాలను చెప్పేందుకు కూడా ప్రజానీకం ముందుకు రావడం లేదని అధికారులు చెప్పడం గమనార్హం.

పట్టణాలు, నగరాల్లో గందరగోళం

గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే నగరాలు, పట్టణ ప్రాంతాల్లో సర్వే తీరు మరింత దారుణంగా ఉన్నదని క్షేత్రస్థాయి అధికారులు వాపోతున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో సర్వే కోసం వెళ్లిన ఇద్దరు ఎన్యూమరేటర్లపై ఓ ఇంటి యజమాని కుక్కలను ఉసిగొల్పగా, మరోచోట ఓ యజమానురాలు ఏకంగా దాడికి దిగినంత పనిచేసింది. అలాగే పలువురు సంపన్న శ్రేణి, ఎగుమ మధ్యతరగతి గృహ యజమానులైతే ఇండ్లకు స్టిక్కరింగ్ చేసేందుకు కూడా సహకరించడం లేదని, వద్దని తిప్పి పంపుతున్నారని తమ అనుభవాలు చెప్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలోకి అనుమతించడమే లేదని వాపోతున్నారు. అనేక రకాలుగా ప్రయత్నించి ఒక వేళ నివాస సముదాయాల్లోకి వెళ్లినా అక్కడ కూడా ప్రశ్నలు, నిలదీతలే ఎదురవుతున్నాయని, వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియక గందరగోళ పరిస్థితి నెలకొన్నదని ఎన్యూమరేటర్లు తలలు పట్టుకుంటున్నారు. నగరాల్లోని అపార్ట్‌మెంట్లలో నివసించే కుటుంబాల సేకరణ మరింత సవాల్‌గా మారిందని ఎన్యూమరేటర్లు వివరిస్తున్నారు. ఇండ్లకు వెళ్లే సమయానికి అపార్ట్‌మెంట్లలో ఎవరూ ఉండటం లేదని, ఉన్నా కూడా సమాచారం ఇవ్వకుండా ఎలా వస్తారని ప్రశ్నిస్తున్నారని, ఎప్పుడు వస్తారో తెలియకుండా ఇంట్లోనే ఎలా ఉంటాం. మాకేమీ పనిలేదా అంటూ ప్రశ్నిస్తున్నారని ఎన్యూమరేటర్లే స్వయంగా వెల్లడిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

(పెద్దపల్లి జిల్లా) (టీచర్)

గృహ యజమాని: ఎవలు మీరు. ఏం కావాలి?
ఎన్యూమరేటర్: నేను టీచర్‌ను అమ్మ. సర్వే కోసం వచ్చిన.
గృహ యజమాని: సర్వే లేదు ఏం లేదు పో!
ఎన్యూమరేటర్: అట్ల కాదమ్మ. సర్కారు పంపింది. వివరాలు చెప్పితే మంచి జరుగుతది. సర్కారు మంచి చేస్తది.
గృహ యజమాని: మా సాలు చేసిన మంచి. పింఛన్ పెంచుతన్నడు. ఏం పెంచిండు? గ్యాస్ ఇత్తనన్నడు ఇచ్చిండా? ఓ మళ్ల వచ్చిండ్లు. నేనేం చెప్ప.
ఎన్యూమరేటర్: అట్లా కాదమ్మా! మీవోళ్లు ఎవలు లేరా?
గృహ యజమాని: ఎవలు లేరు పో.
ఎన్యూమరేటర్: చేసేదేమీలేక స్టిక్కర్ వేయకుండానే వెనుదిరిగిన పరిస్థితి.

హైదరాబాద్‌లో కులగణన సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు

ఎన్యూమరేటర్లపై సర్కారు ఒత్తిడి

సర్వే కోసం వెళ్లిన అధికారులను నిలదీయడంతోపాటు, పలువురు వీడియోలు కూడా తీసి సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నెటిజన్లు అనేక విధాలుగా కామెంట్లు పెడుతున్నారు. సోషల్‌మీడియా వేదికగా కూడా ప్రభుత్వంపై ప్రజలు పెద్ద ఎత్తున వ్యతిరేకతను వ్యక్తపర్చడం గమనార్హం. ఈ విషయం తెలిసిన ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం తీవ్ర అసహనానికి గురవుతున్నట్టు తెలుస్తున్నది. ప్రజలు వీడియోలు తీసేందుకు అంగీకరించవద్దని, అలా చేస్తే అక్కడి నుంచి వెళ్లిపోయేలా చూడాలని అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలిచ్చినట్టు తెలుస్తున్నది. ఇదిలా ఉంటే ఇప్పటికే వైరల్‌గా మారిన వీడియోలను సోషల్ మీడియా వేదికల నుంచి తొలగించాలని కూడా సంబంధిత సైబర్ విభాగం అధికారులకు హుటాహుటిన ఆదేశించారని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

తొలిరోజే తీవ్ర వ్యతిరేకత

ఇంటింటి సర్వే ప్రారంభమైన తొలిరోజైన శనివారం ఊహించని చేదు అనుభవాలు ప్రభుత్వానికి ఎదురవుతున్నాయి. వివరాలను ఇచ్చేందుకు ప్రజానీకం పూర్తి విముఖతను చూపుతుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. స్టిక్కరింగ్ ప్రక్రియ ముగిసిపోగా, ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణను శనివారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 87 వేల మంది ఎన్యూమరేటర్లు సర్వేలో పాల్గొన్నారు. సర్వే ఫారాలో ప్రధాన ప్రశ్నలు 57, ఉపప్రశ్నలు 18 కలిపి మొత్తంగా 75 ప్రశ్నలతో కూడిన ఫారాలను పూర్తిగా నింపాల్సి ఉన్నది. దాదాపు ఈ ప్రక్రియ 10 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగనున్నది. ఒక్కో ఎన్యూమరేటర్ రోజుకు 10 ఇండ్ల చొప్పున వివరాలను నమోదు చేయాల్సి ఉంది. ఒక్కో సర్వే కాపీ నింపడానికి గంట పైనే పడుతుందని ఎన్యూమరేటర్లు వివరిస్తున్నారు. సమాచార సేకరణకు ప్రజలను అనేక విధాలుగా ఒప్పించాల్సి వస్తున్నదని, అప్పటికీ అరకొరగానే వివరాలు వస్తున్నాయని తెలుపుతున్నారు. మొత్తంగా నవంబర్18లోగా సర్వే ముగించడం కష్టమేనని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.

భయం లేకుండా గుడికి వెళ్తున్నారా?

ఇంటింటి సర్వే ఫారంలో ప్రభుత్వం ఇప్పటికే పొందుపరిచిన ప్రశ్నలపై అనేక విధాలా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ప్రభుత్వం ఆ జాబితాలో మరో 3 ప్రశ్నలను జోడించగా వాటిపైనా ప్రజలు సెటైర్లు వేస్తున్నారు. హైకోర్టు ఆదేశాలతో నో క్యాస్ట్, నో రిలీజియన్ కాలమ్ చేర్చగా, అవిగాకుండా మరో 2 ప్రశ్నలను ప్రభుత్వం జాబితాలో చేర్చింది. 55వ ప్రశ్నగా కుటుంబంలో ఎవరైనా కులాంతర వివాహం చేసుకున్నారా? 56వ ప్రశ్నగా మీ కుటుంబంలోని సభ్యులు ఎలాంటి బెదిరింపులు, వివక్ష లేకుండా స్థానిక ఆలయాలకు, మసీదులకు, చర్చిలకు, ఇతర ప్రార్థనాలయాలకు వెళ్తున్నారా? అని పొందుపరిచింది. ఈ రెండు ప్రశ్నలను చేర్చడంలో ప్రభుత్వ ఆంతర్యమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇవిగాక ప్రశ్నావళిలో అనేక అసంబద్ధ ప్రశ్నలను పొందుపరిచిందని సామాజికవేత్తలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. రుణం ఎంత తీసుకున్నారు? ఎక్కడి నుంచి తీసుకున్నారు? ఇంటి విస్తీర్ణం ఎంత? ఎన్ని గదులు ఉన్నాయి? మీ ఇంట్లో ఎన్ని ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లు, పందులు ఉన్నాయి తదితర అనవసర ప్రశ్నలు అనేకం ఉన్నాయని ఇటు ప్రజలు, అటు ఎన్యూమరేటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గుండ్లపల్లి, దిలావర్‌పూర్‌లోనూ సర్వే చేయాలి: బీసీ కమిషన్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి, దిలావర్‌పూర్ గ్రామాల్లోనూ సర్వే నిర్వహించేందుకు చొరవ చూపాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను ఆదేశించారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును నిరసిస్తూ ఆయా గ్రామాల ప్రజలు సమగ్ర కుటుంబ సర్వేను బహిష్కరించాలని నిర్ణయించారు. దీనిపై స్పందించిన చైర్మన్.. కలెక్టర్‌తో ఫోన్లో సంప్రదించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ గ్రామస్తులను సంప్రదించి సర్వే ప్రయోజనాలను వివరించాలని, సర్వేను అడ్డుకోకుండా ఒప్పించాలని ఆదేశించారు.

ఇంటింటి సర్వేలో భాగంగా ఇండ్లకు స్టిక్కర్లు వేసేందుకు వెళ్లిన పలువురు ఎన్యూమరేటర్లు గగ్గోలు పెడుతున్నారు. ఇంటింటా తమనే ఎదురు ప్రశ్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ అధికారికి ఎదురైన అనుభవాలు ఆయన మాటల్లోనే..

'ఇండ్లకు స్టిక్కర్లు పెట్టడానికి వెళ్తే మాకే ఎదురు ప్రశ్నలు వేస్తున్నరు. మాకేమిస్తున్నారు? సీఎం రేవంత్‌రెడ్డి మాకేమిచ్చిండు? ప్రజాపాలన అని దరఖాస్తులు తీసుకుపోయారు. రెండు మూడు రోజులు లైన్ల నిలబడి ఫారాలు నింపి ఇచ్చినం. అవి ఎక్కడ? ఏం చేశారు? గ్యాస్ ఇస్తానన్నాడు ఇవ్వలేదు. ఇండ్లు ఇస్తానన్నాడు ఇవ్వలేదు. వచ్చే పింఛన్లు కూడా ఇప్పుడు సరిగా వస్తలేవు. రేషన్‌కార్డులు కూడా ఉన్నోళ్లకు ఉన్నయ్. లేనోళ్లకు లేవు. ప్రతీ ఆడామె కూడా రూ.2,500 ఏవీ అని అడుగుతున్నరు. ఇప్పుడు ఇండ్ల నంబర్లను ఇస్తున్నం కదా. చెరువులల్ల ఇండ్లను కూల్చినట్టు మా మీద ఏమన్న జరిమానా వేస్తరేమో? మీరొచ్చి బాధ్యత వహిస్తరా? అని ప్రజలు అడుగుతున్నరు. మాకు ఏమొచ్చినయ్ అని ముసలోళ్లు అయితే మస్తు తిడుతున్నరు. ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని ఘోరంగా తిడుతున్నరు. మాకేమీ రాదు.. మాకేమీ వద్దు.. మా వివరాలు ఏం అడగొద్దు.. మీరేమీ అనుకోవద్దు వెళ్లిపోండి.. మాకు ప్రభుత్వం ఏం ఇస్తలేదు. సపోర్ట్ చేస్తలేదు. మేం కూడా సపోర్ట్ చేయం. అయినా మా ఆస్తి, అప్పుల గురించి అడిగే హక్కు ఎక్కడిది? అధికారం ఇచ్చినోళ్లను తీసుకురా పో' అంటూ వెళ్లగొడుతున్నారు' అని ఆయన చెప్పారు.

ప్రాంతం: జీహెచ్ఎంసీ పరిధిలోని మేడ్చల్ (ఆశావర్కర్)

గృహ యజమాని: ఏం పేరమ్మా? ఎక్కడి నుంచి వచ్చారు? ఎందుకొచ్చారు?
ఎన్యూమరేటర్: సమగ్ర ఇంటింటి సర్వే కోసం జీహెచ్ఎంసీ నుంచి వచ్చా.
గృహ యజమాని: సర్వే ఎందుకోసం. ప్రజలకు ఏం ఉపయోగపడుతుంది?
ఎన్యూమరేటర్: సీఎం రేవంత్‌రెడ్డిని అడగండి..
గృహ యజమాని: మరి మీరెందుకొచ్చారు?
ఎన్యూమరేటర్: కలెక్టర్ పంపిస్తే వచ్చాం
గృహ యజమాని: మీకు అవగాహన లేదన్న మాట?
ఎన్యూమరేటర్: లేకుండా ఎందుకు వస్తం. అవగాహన ఉన్నది.
గృహ యజమాని: అయితే సర్వే ఎందుకో వివరంగా చెప్పండి.
ఎన్యూమరేటర్: మీ కుటుంబ సభ్యుల వివరాలు, ఏం చదువుకున్నారు? ఉద్యోగం చేస్తున్నారా? ఆదాయం ఎంత వస్తుంది? ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందుతున్నారా? రాజకీయం, మీ కులం అన్ని వివరాలను నమోదు చేస్తాం.
గృహ యజమాని: ఈ వివరాలతో ఏం చేస్తరు? ప్రజలకు ఏం ఉపయోగపడుతుంది?
ఎన్యూమరేటర్: కలెక్టర్‌కు ఇస్తాం. వాళ్లు ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ఇస్తరు.
గృహ యజమాని: మా పర్సనల్ వివరాలతో వాళ్లేం చేస్తరు?
ఎన్యూమరేటర్: మీ పర్సనల్ వివరాలను ఇప్పుడేం అడగలేదు. కేవలం స్టిక్కర్ వేస్తాం. తర్వాత వివరాలు తీసుకుంటాం.
గృహ యజమాని: పేరైనా ఎందుకు అడుగుతున్నరు? ఏం తెల్వకుండా ఎందుకు వచ్చిన్రు? సర్వే దేనికి ఉపయోగపడుతది?
ఎన్యూమరేటర్: పేదలకు లాభం జరుగుతది. ఉపాధి పథకాలు అందుతయి. మీకు ఇంట్రెస్ట్ ఉంటే చెప్పండి. లేదంటే నాట్ ఇంట్రెస్టెడ్ అని చెప్పండి.
గృహ యజమాని: సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు ఎంతమందికి ఏమిచ్చిండు. గ్యారెంటీలు ఏమైనయ్? గ్యారెంటీలు అంటే ఏంటో తెలుసా?
ఎన్యూమరేటర్: గ్యారెంటీలు అంటే హామీలు
గృహ యజమాని: హామీ అంటే నేను చేస్తా అని ఒప్పుకోవడం. మరేం చేసిండు ఇప్పటివరకు?
ఎన్యూమరేటర్: నేను రాజకీయంగా రాలేదు. నన్ను ఈ ప్రశ్నలు అడగొద్దు.
గృహ యజమాని: రాజకీయంగా రాకపోతే ఎందుకచ్చినవ్. రేవంత్‌రెడ్డి రాజకీయంగా రాకపోతే ఆయనంత ఆయనే ఓట్లు వేసుకుని గెలిచిండా? మీకు కూడా హక్కుంది కదా? మీకేమన్న హామీలు వచ్చినయా?
ఎన్యూమరేటర్: సమాధానం లేకుండానే అక్కడి నుంచి వెనుదిరిగి పోయారు.

బంజారాహిల్స్‌లోని అరోరా కాలనీలో సర్వేకు వెళ్లిన తమపై యజమానులు కుక్కలు వదిలినట్టు చెబుతున్న టీచర్లు అపురూప, రమ్యశ్రీ

మళ్లీ మెయిన్స్ తప్పదా?

- జీవో-29 కోర్టులో నిలబడేనా..?
- సుప్రీం కోర్టు తీర్పు ప్రభావం పడే అవకాశం
- కొత్త పల్లవి అందుకున్న రేవంత్‌రెడ్డి సర్కారు
- ఇప్పుడు మెయిన్స్ రాసినవారిని మినహాయించి..నార్మలైజేషన్ చేయాలంటున్న అభ్యర్థులు
- ఇది ప్రభుత్వ కుట్రగా ఆరోపిస్తున్న గ్రూప్- 1 అభ్యర్థులు

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): ఎన్నో వివాదాలకు మూలంగా మారిన గ్రూప్-1 మెయిన్స్ మళ్లీ తప్పదా..? కొత్త సెలెక్షన్ చేయాల్సిందేనా..! అంటే నిరుద్యోగులు అవుననే అంటున్నారు. జీవో-29 కోర్టులో నిలబడదని, పైగా సుప్రీంకోర్టు తీర్పు సైతం నోటిఫికేషన్‌పై ప్రభావితం చూపుతుందని అభ్యర్థులు అంటున్నారు. మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామకాల్లో ప్రిలిమ్స్‌లోనూ రిజర్వేషన్లను వర్తింపజేయాలన్న తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును మన దగ్గర అమలుచేయాల్సి ఉంటుంది. ఇదే జరిగితే గ్రూప్-1 పరీక్షలను మళ్లీ నిర్వహించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే మెయిన్స్ రాసిన అభ్యర్థులను ప్రభుత్వం రెచ్చగొడుతుందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

నార్మలైజేషన్ అంటూ కొత్త పల్లవి

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం పట్టుదలకు పోయింది. అభ్యర్థులు వాయిదావేయమని ఎంత మొత్తుకున్నా వినకుండా పరీక్షలను నిర్వహించింది. హైకోర్టు తుది తీర్పు వచ్చిన తర్వాతే ఫలితాలు ప్రకటించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఇటీవలే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు రాసిన వారు కొత్త పల్లవి అందుకున్నారు. టీజీపీఎస్సీకి ఓ లేఖ రాశారు. 'ఒక వేళ కోర్టు కేసులతో గ్రూప్-1 మెయిన్స్‌ను మళ్లీ నిర్వహించాల్సి వస్తే తాము మళ్లీ రాయలేం. మళ్లీ పరీక్షను నిర్వహిస్తే తమను మినహాయించి కొత్తగా 1:50 రేషియోలో ఎంపికైన వారికే మళ్లీ పరీక్షను నిర్వహించాలని, నార్మలైజేషన్‌ను చేపట్టాలి' అంటూ లేఖను సంధించారు. మళ్లీ మెయిన్స్‌ను నిర్వహిస్తారనేందుకు ఇదే తార్కాణమంటున్నారు. కోర్టులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు వస్తుందని గ్రహించి, ప్రభుత్వం సొంత వ్యక్తులతో ఇలా లేఖలు రాయిస్తున్నదని అభ్యర్థులు మండిపడుతున్నారు. దీని వెనుక కుట్ర దాగిఉందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఇదంతా ప్రభుత్వ కనుసన్నల్లోనే జరిగిందని వాపోతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నేతలు గ్రూప్-1 పోస్టులను అమ్ముకున్నారని, మళ్లీ పరీక్ష నిర్వహిస్తే ఇప్పుడు ఎంపికైన వారు పోటీలో ఉండరని, దీంతోనే కొత్త కుట్రలకు పాల్పడుతున్నారని నిరుద్యోగి జనార్ధన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు లేఖలు రాసినవారంతా గ్రూప్-1 పరీక్షతో సంబంధం లేని వారేనని, ఇలాంటి వారితో కుట్రలు చేయడం దారుణమని మరో అభ్యర్థి శివ మండిపడ్డారు.

సర్వేను అడ్డుకుంటామని పంచాయతీ కార్యదర్శికి తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామస్థులు

సమగ్ర సర్వేను బహిష్కరిస్తాం

- రాజన్న సిరిసిల్ల జిల్లా వెంకట్రావుపల్లి వాసుల తీర్మానం
- గ్రామ శివారు సమస్యను పరిష్కరించాలని డిమాండ్

ఇల్లంతకుంట, నవంబర్ 9 : తమ గ్రామ శివారు సమస్యను పరిష్కరించే వరకు సమగ్ర కుల సర్వేను బహిష్కరిస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపల్లి గ్రామస్థులు స్పష్టం చేశారు. ఈ మేరకు సర్వే నిర్వహించడానికి సహకరించబోమంటూ చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గొల్లపల్లి గ్రామ పంచాయతీ నుంచి వెంకట్రావుపల్లి 2018లో నూతన గ్రామ పంచాయితీగా ఏర్పడిందని, ఓటరు జాబితా ప్రకారం రెవెన్యూ సరిహద్దు నిర్ణయంలో సమస్య ఏర్పడి ఇప్పటి వరకు పరిష్కారం కాలేదని తెలిపారు. దానిని వెంట నే పరిష్కరించాలని, లేనిపక్షంలో సమగ్ర సర్వే బహిష్కరణకు అన్ని కుల సంఘాల ప్రజలు సిద్ధంగా ఉన్నట్టు స్పష్టం చేశారు.

కులగణన బహిష్కరిస్తున్నాం

- లబానా లంబాడా సమాజ్ వెల్లడి

కామారెడ్డి రూరల్, నవంబర్ 9: లబానా లంబాడా కులాన్ని బీసీల్లో చేర్చక పోవడాన్ని నిరసిస్తూ కుల గణనను బహిష్కరిస్తున్నట్టు లబానా లంబాడ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్ నాయక్ తెలిపారు. శనివారం ఆయన కామారెడ్డిలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలోని తొమ్మిది నియోజక వర్గాల్లో 2 లక్షల మందికిపైగా లబానా లంబాడాలు ఉన్నారని, తామంతా కుల గణనకు దూరంగా ఉంటామని చెప్పారు. లబానా లంబాడాలకు భాష, బీసీ కుల జాబితాలో గుర్తింపు ఇచ్చిన తర్వాతే గణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

సర్వేపై విస్తృత ప్రచారం: భట్టి

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): సమగ్ర కుటుంబ సర్వేపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని, ప్రజల సందేహాలను ఎప్పటికప్పుడు తీర్చాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. ప్రధానంగా పట్టణాలపై దృష్టి పెట్టాలని కోరారు. సర్వేపై శనివారం ఆయన ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్లు ఎన్యూమరేటర్లతో మాట్లాడితే ప్రజల సందేహాలను తెలుసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు భాగస్వాములయ్యేలా చూడాలని చెప్పారు.

గవర్నర్ వివరాల సేకరణ

సర్వేలో భాగంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వివరాలను అధికారులు సేకరించారు. ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ స్నేహ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ

11, 12న మాసబ్‌ట్యాంక్ డీఎస్ఎస్ భవన్‌లో నిర్వహణ

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేషన్ కమిషన్ రెండు రోజులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది. 11,12న హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో డెడికేషన్ కమిషన్ చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ విచారణ చేపట్టనున్నారు. 11న ప్రజలందరికీ అవకాశం కల్పించగా, 12